# బాలామణి




కలువకొలను సదానంద

నెమిలికోన!

కొండకోనల పరదాల్లో, గుబురుటడవుల కౌగిట్లో—కొత్త పెండ్లికూతురివలె ఒదిగి కూర్చున్న చిన్నపల్లె! అక్కడి పచ్చిక వేలల్ని, పచ్చని చెట్లను చూస్తే పురి విప్పిన నెమళ్ళ జ్ఞాపకానికొస్తాయి.

నెమిలికోనకు రోడ్డు లేదు. ఆ వూరు చేరాలంటే సింగారపాళెంలో బస్సు దిగి, కాలిబాట వెంబడి నాలుగు మైళ్ళ నడవాల.

ఆ చుట్టుపక్కల పల్లెపట్లన్నిటికీ సింగారపాళెం నడిగడ్డ. వారం వారం జరిగే సంతకూటంతో, రోజా పల్లెజనాన్ని సూదంటురాయివలె ఆకర్షించే కొద్దిపాటి టౌనుహంగులతో సింగారపాళెం సింగార మొలుకుతూ వుంటుంది.

నీడలన్నీ మనిషి కోరికలవలె ఒక్కసారిగా నేలమీదికి చేతులు బారజాపిన వేళ — తాతలకాలంనాటి సన్నటి కంకర రోడ్డుమీద దుమ్మును రేపుకుంటూ బస్సు వచ్చి సింగారపాళెం బజారువీధిలో నిలిచింది. సుందరాచారి, బాలామణి బస్సులో నుంచి దిగినారు. సుందరాచారి సుందరుడే! బాలామణి బాలామణే! బస్‌స్టాండ్‌లోని జనం ఆ జంటను చూసి, కొన్ని క్షణాల కాలం ఒళ్ళు మరిచిపోయినారు. బాలామణి కన్నుల వెలుగు పగలే వెన్నెలవలె, బస్సు సుడులు రేపిన దుమ్ము శారదాకాశంలోని తెల్ల మబ్బులవలె, ఉయ్యాలలూగుతూ వొచ్చి నిలిచిన బస్సు వెండి మబ్బుల నురగలపైన తేలుతూ వొచ్చిన పూల తెప్పవలె, బాలామణీ సుందరాచారులు— ఆ పూల తెప్పలోనుండి దిగి నేలమీద అడుగుపెట్టిన తారాశశాంకులవలె తోచి, సింగారపాళెం బస్ స్టాండు బస్‌స్టాండూ మతి పోగొట్టుకొని, ఒక్క నిమిషంసేపు గోడమీది బొమ్మె అయిపోయింది. బాలామణి ముఖం తామరపూల దొరసానివలె కనబడి దేమో — ఏడు గుర్రాల బండిపై నెక్కి, పడమటికి ప్రయాణం కట్టిన సూర్యుడు ఒకసారి కన్నులపండగ జేసుకొనిపోదామని కొంచెం నిక్కిచూచినాడు.

బొమ్మసముద్రం నిమ్మపండువంటి బాలామణి—మామిడిపిందెలంచు, సంపంగి రంగు వెంకటగిరి చీర కట్టుకొనింది. పొంకంగా అదే రంగు రవిక తొడిగింది. నల్లని జడలో కదంబం తురుముకొనింది. మగనిమీది వలపంతా తెల్లమయ్యేట్లు— నొసట ఎర్రని కుంకుమబొట్టు దిద్దుకొనింది. ఆమె చెవులకున్న, తెల్లరాళ్ళ కమ్మలు, ముక్కున వున్న చిన్న ముక్కుపుల్ల ఆమె చెంపల్లో తమ అందాల్ని చూసుకుంటూవున్నాయి. చెక్కిన చందనపు కట్టెవంటి ఆమె మెడను తాళిబొట్టు కూర్చిన పసుపుతాడు, నల్లపూసలదండ కౌగిలించుకొన్నాయి. చేతులకు గుత్తమైన కాళహస్తి గాజులు. ముఖాన కదిరి మల్లెపూల సరంవంటి తెల్లని చల్లని చిరునవ్వు. మగవాడు కోరుకొనే వరం మాదిరిగా వుంది పద్దెనిమిదేడ్ల బాలామణి.

సుందరాచారిది చామనచాయ. మామూలు పొడుగు. ఆడంషానికి పనికొచ్చే సన్నని నాజూకైన ఒళ్ళు. పక్కపాపిడిదీసి, సన్నగా అణగదువ్విన క్రాఫు. కార్తికమాసపు కొల

ములవలె తేటతెల్లని కనులు; కల్లా కపటంలేని ముఖం. అతను కట్టుకొన్న ధోవతి, తొడుగుకొన్న చొక్కా బాలామణి మీది మక్కువవలె తెల్లగా, తేటగా వున్నాయి. బాలామణి మాటల్లో 'నా వేయి నోముల ఫలం' సుందరాచారి.

గుడ్డకు గుడ్డ ముడి పెట్టినట్లు ఆ అల్లూ, మగడూ రోడ్డువార ఒకటి రెండు నిమిషాలసేపు నిలబడినారు. ఎదురుగా బీడీ బంకులో కూర్చున్న ఒంటి కంటి మనిషి బేరం సారం ఆపి, బాలామణిని కన్నార్పకుండా చూస్తూ వుండి పోయినాడు. పక్కన టీ అంగడివాడు చక్కెర వెయ్యకుండనే టీ కలిపినాడు. అంగడిముందర బెంచీమీద కూర్చున్న బట్టతలాయన ఆ టీ అందుకొని ఒక గుక్క చప్పరించినాడుగానీ, చక్కెర లేదేమని అడిగినవాడు కాదు. వాళ్లిద్దరి చూపులూ బాలామణి మీదనే!

ఎడమచేతికి ట్రంకుపెట్టె ఎత్తుకొని, కుడిచేతిలో గొడుగు పట్టుకొని ముందు సుందరాచారి, వెనకాల బాలామణి బజారులోకి నడిచినారు. ఎదురుగా వస్తూ వుండిన పోగ్గా డొకడు ఆమె పక్కగా నడిచి, సందడిలో ఆమె భుజాన్ని రాచుకుంటూ పోయినాడు. అరవై ఏండ్లు బతికి, కడాపటిదినం సమారాధనలో అన్నం తిన్న దర్రిదుడివలె తృప్తి పడినాడు వాడు.

బాలామణి నడుస్తూ నడుస్తూ సుందరాచారి పక్కకొచ్చి 'మామా! చమ్కీ గాజులు!...' అనింది.

'కొనుక్కుందాం!' అన్నాడు సుందరాచారి.

బజారు వీధిలో అంగళ్లన్నీ అప్పటికే తెరిచివున్నాయి.

ఇద్దరూ గాజులంగడిలోకి పోయినారు. అంగడివాడు చూపించిన రకరకాల గాజుల్లో తనకు నచ్చినవి, సరిపడేవీ రెండు జతల చమ్కీ గాజులు ఏరి, వాటిని కాగితంలో చుట్టి ఇమ్మనింది బాలామణి. తన చేతులతో అంత చక్కని పిల్లకు గాజులు తొడిగే అదృష్టంలేదని తెలుసుకొన్నాక, గాజులవాడికి ఆమె ఏరి కోరుకొన్న గాజుల మీద అసూయ పుట్టింది. గాజులతో బాటు రెండు నైలాన్ రిబ్బన్లు కూడ కొనుక్కొని ఆ జంట బయటపడింది.

ఊరుదాటి, వేమలికోనకు పోయే బండి బాటలోకి మరలినారు వాళ్లు. 'ఎంత దూరం వుంటుంది మామా?' అనింది బాలామణి చిలక మాదిరిగా.

'గబగబా నడిస్తే బిరాన వెళ్లిపోవచ్చు మెల్లిగానే నడుద్దాం. నీ కాళ్లు కంది పోతాయి!' అంటూ సుందరాచారి బరువుగా వున్న ట్రంకుపెట్టెను భుజంపైకెత్తుకున్నాడు. 'గొడుగు నాచేతి కియ్యి!' అనింది బాలామణి నవ్వుతూ.

చలికాలపు నీరెండ యింకా చురుకెక్కలేదు. దోవపక్కల చేనికల్లలమీద, తీగలమీదకూర్చొనిపిచ్చుకగువ్వలుఉయ్యాలలూగుతూ వున్నాయి. రకరకాల పిట్టలు ఒక పొదలోనుండి ఇంకొక పొదలోకి తుర్రుమంటూ ఎగురుతూ వున్నాయి. కోతలయిపోయిన పొలాల్లో మొలిచిన పచ్చిగడ్డి మంచు ముత్యాలతో తలంబ్రాలు పోసుకొనింది. చేలను ఒరుసుకుంటూ, గుట్టలను చుట్టుకుంటూ, పైకిలేస్తూ కింద్దికి దిగుతూ—దూరంగా కనబడే నీలి కొండల దిక్కుగా చూపుకంటే ముందుగా సాగిపోతూవుంది బాట. ఆ ఎర్రని మట్టిబాటలోని ఎగుడుదిగుళ్లలో ముండ్లకంపల్ని, గులకరాళ్లను తొక్కుకుంటూ, ఆయాసపడుతూ, సుందరాచారి కొంటె మాటలు విని మనసార నవ్వుకుంటూ, ఆ పులకరింపులో తన ఆయాసాన్ని అప్పటికప్పుడే మరిచిపోతూ—కష్టసుఖాల బండివలె నడిచి పోతూవుంది బాలామణి.

కొంచెం దూరం వెళ్లినాక సుందరాచారి ఆగి 'నా చెప్పులు తొడుక్కో బాలామణీ!' అంటూ తన చెప్పులు విడిచి పెట్టినాడు.

'వొద్దు మామా! పద!' అనింది బాలామణి...

'దోవ బాగానేవుంది మామా!'

'తొడుక్కో!'

'అయితే నీకు?'

'తొడుక్కోమంటుంటే!...'

బాలామణి ఇష్టంలేకుండానే తొడుగుకొనింది. సుందరాచారి పెద్ద చెప్పుల్లో బాలామణి చిన్న పాదాలు. లంకంత యింట్లో గువ్వంత పెండ్లాం మాదిరిగా!

పొద్దు పైకెక్కి, ఎండ చురుకెక్కి, నీళ్లతో నిండివుండే కుంటలు, వంకలు వెండిరేకులవలె తళతళా మెరుస్తూ వున్నాయి. ఆ ఎండ బాలామణి మీద కూడా పడి, ఆమె చెంపల్ని బంగారు రేకులవలె మెరిపించినాయి.

'గొడుగు విప్పిపట్టుకో!' అన్నాడు సుందరాచారి.

'ఎండ ఎక్కడిది మామా?'

'మొగుడు జెప్పినమాట వినాల!'

'అయితే నీకు?'

'నువ్వుంటే నాకు వేరే గొడుగేల?' అన్నాడు సుందరాచారి. ఆమాటే తిప్పి చెప్పాలని బాలామణి మనసులో వుంది. అయితే సిగ్గు ఆ మాట చెప్పనిస్తుందా? ఎంత మొగుడైనా—తాను ఆడది కదా?... బాలామణి మాటాడకుండా గొడుగు తెరిచి పట్టుకొనింది.

వాళ్లు మూడుమైళ్లు అట్లల నడిచినారు. బాటకు అడ్డంగా పారుతూవున్న సన్నటి వంక దగ్గరికొచ్చినారు. 'జాగర్తగా నడువు. పాచిమీద కాళ్లు జారతాయి.' అన్నాడు సుందరాచారి. బాలామణి చెప్పులు తీసి అవతలిగట్టుకు విసిరివేసింది. గొడుగు మడిచి చంకన బెట్టుకొని, తితో చేచీర కుచ్చిళ్లు పైకెత్తి పట్టుకొని, పాచి పట్టిన రాళ్లమీద జాగర్తగా అడుగు మోపుతూ వంక దాటుకొని, చెప్పులు చేతికెత్తుకొనింది. సుందరాచారి కూడా వంక దాటివొచ్చినాక 'చాలా వేసటగా వుంది మామా! ఎక్కడైనా కొంతసేపు కూర్చొనిపోదాం' అనింది.

'అట్లలనే కానీ!' అన్నాడు సుందరాచారి.

ముందరే మలుపులో బాటకు కుడి పక్కన కపిలబావి వుంది. బావి గట్టున చల్లగా జామచెట్టునీడ. వాళ్లు జామ చెట్టుకిందికి రాగానే—చెట్టెక్కి పిందె కాయలు కోస్తూవుండిన ఇద్దరు పిల్లకాయలు బిరబిరా చెట్టుదిగి 'నమస్తే సార్!' అంటూ నిలిబడినారు.

'ఓరె! మీరా? కోతులనుకొంటి. పశువుల పండగ బాగాజరిగిందా మీ ఊళ్లో?' అన్నాడు సుందరాచారి.

'బాగా జరిగిందిసార్!' అన్నాడు ఒక పిల్లవాడు.

ఇంకొక పిల్లవాడు బిడియపడుతూ—'ఎవరుసార్ ఈ అయ్యవారమ్మ?' అని అడిగినాడు.

'అవును అయ్యవారమ్మే!'

పిల్లకాయలు పరుగుదీసినారు.

బాలామణి, సుందరాచారి చెట్టునీడన కూర్చున్నారు. జామచెట్టు కొమ్మపైకి రెండు చిలకలొచ్చి కూర్చున్నాయి పిల్ల గాలి పరిగెత్తొచ్చి బాలామణి చెవుల దగ్గర ఇల్లు గట్టుకొనింది. ఊరిలోకి వచ్చిన సినిమా స్టారును చూసేందుకు ఎగబడే పడుచువాళ్లవలె — కాలవగట్టున చెండ్లు చెండ్లుగా పూచివున్న తురక చామంచి పూలు బాలామణి అందాలు చూసేందుకు ఒకదాన్నొకటి నెట్టుకుంటూ వున్నాయి. స్వర్గంవంటి ఆ చల్లనిచోట ఒకరి సరసలో ఒకరు కూర్చొనివుంటే— అంతకంటే హాయి ఇంకేదీ లేదనిపించింది ఆ యిద్దరికీ.

పిల్లకాయలు కోసి కొరికిపారేసిన జామ పిందె నొకదాన్ని చేతికి తీసుకొనింది బాలామణి. 'పచ్చి పిందెలు కోసేసినారు మామా! దీనిలో ఏముందనో? చెట్టునన్నే వుండివుంటె—రేపటికో, ఎల్లుండికో ఇవి పెద్దవై, దోరమాగేవి చెట్టుకు అంద మొచ్చేది.'

'ఈ చెట్టు వాళ్లదిగాదు.' అని, 'నీ దగ్గర పిన్ను వుందా?' అని అడిగి వాడు సుందరాచారి.

'ఏల?'

'ముల్లు విరిగింది'

బాలామణి తన రవికకున్న పిన్ను ఊడ దీసింది మగడిపాదం చేతిలోకి తీసుకొని, అరికాల్లో విరిగిన ముల్లు తీయసాగింది. సుందరాచారి కనులు మూసుకొన్నాడు. 'ఓ యమ్మో! ఎంత పెద్ద ముల్లు!' అనింది బాలామణి. సుందరాచారి కనులు తెరచినాడు. తీసిన ముల్లు అరచేత బెట్టుకొని, కనురెప్పలోనుంచి ఒక వెంట్రుక పెరికింది బాలామణి. 'ఎందుకు? ఏం చేయబోతావు?' అన్నాడు సుందరాచారి. 'మంచిముల్లో, చెడ్డముల్లో చూడ వద్దంటావా? వెంట్రుకకు అంటుకుంటే మంచిముల్లు, అంటుకోకుంటే చెడ్డ ముల్లు!'

వెంట్రుకను సూదివలె పట్టుకొని ముల్లుమీద పెట్టగానే—ముల్లు వెంట్రుకకు అంటుకొనింది.

'అరె! మంచి ముల్లే!' అన్నాడు సుందరాచారి.

'ఛీ! పాపిష్టిముల్లు! నీ కాలికి గుచ్చుకున్నాక మంచి ముల్లెట్లవుతుంది?' అంటూ బాలామణి దాన్ని విసిరిపారేసింది.

'వొద్దంటే విన్నావుగాదు. చెప్పులు తొడుగుకోమంటివి. నీ చెప్పులు నాకాళ్ల గరిచినాయి.' అంటూ తన పాదాలమీది బొబ్బల్ని చూపించింది. సుందరాచారి ఆ పాదాలను చేతితో తడిమినాడు. సుందరాచారి కాలిలో ముల్లు విరిగింది. బాలామణి కాళ్లను సుందరాచారి చెప్పులు కరిచినాయి. ఇద్దరూ పగలబడి నవ్వుకొన్నారు.

బాలామణి గబుక్కని కాళ్లు వెనక్కు తీసుకొనింది. నెమలికోన వైపునుండి ఎవరో గొంతెత్తి పాడేపాట వినబడింది. రానురాను ఆ పాట దగ్గరౌతూవుంది. అది గౌరీ కల్యాణం. పదిహేడు, పద్దెనిమిదేండ్లు దటని నల్లటి పిల్లవాడొకడు ఆవును తోలుకొంటూ వస్తూవున్నాడు. వాడు కంటికి బాగా ఆనినంత దూరానికి రాగానే వాడి నోటివెంట వచ్చేపాట ఆగిపోయింది. వాడు దగ్గిరి కొచ్చినాక సుందరాచారిని పలకరించినాడు. 'గుడ్‌మార్నింగ్ సార్! ఎప్పుడొచ్చినారు? తెల్లారి బస్సుకేనా?'

'అవును గురప్పా!' అన్నాడు సుందరాచారి ఆదరంతో నవ్వుతూ.

'శనివారమే వొచ్చేసినారేమి సార్? సోమవారం కదా బడి?'

'జానక్కో! సోమవారమే వొచ్చి అప్పటి కప్పుడే అన్నీ సర్దుకోవాలంటే కుదరదు. ఆదివారం పోకూడదన్నారు, అందుకని ఈరోజే రావటం.'

గురప్ప అరనిమిషం నిశ్శబ్దంగా నిలబడి, 'వొస్తాను సార్! సాయంత్రం ఇంటికాడికొస్తా లెండి.' అంటూ బాట విడిచి, ఆవు మేతకోసరం తుమ్మలకుంట వైసగా వెళ్లిపోయినాడు. మరలా అతని తియ్యనిపాటతో నేలా నింగీ నిండిపోయినాయి.

'జంగాన్ని కోరితివా లింగాల గౌరు?
కట్టుగుడ్డలు లేవు—కావి వస్త్రాలు!
పులితోలు-పుట్టమ్ము, బూదిగంధమ్ము
భూషణంబులు లేవు; పునుకలే కావి.
భుజియింపగా బోలుపుత్రియే గౌరి!
ఎక్కంగ గుర్రమ్ము ఎద్దు కూతూర!
పండ స్థలములేదు—కొండయేగాని!...'

...ఆ పాట వింటూవుంటె ఆ కొత్త జంటకు తేనెజల్లు కురుస్తూ వున్నట్టనిపించింది. పొయ్యిమీది పాలవలె పొంగిపోతున్న మక్కువను దాచుకునేందుకు ఈ గుండె చాలదేమో అనిపించింది. తన్మయుడైన సుందరాచారి జేబులోవున్న చమ్కీ గాజులు తీసి బాలామణి చేతులకు తొడుగుతూ 'ఆ మాటలకు గౌరి ఏమనిందో తెలుసా బాలామణీ?' అన్నాడు మల్గోవా మామిడిపండంత తీయగా.

'తెలుసు' అనింది బాలామణి అంతే తీయగా.

'ఏమనింది?'

ఆమె అతని ముఖంలోకి చూచింది.

'చెప్పు బాలామణీ!'

బాలామణి కనులు మూసుకొనింది.

* * *

బాలామణి గౌరమ్మ అయితే ఆమె వలచికొలిచే జంగమదేవర—సుందరాచారి. పుట్టగానే బాలామణికి 'సుందరుడి పెండ్లాం' అని పేరు పెట్టినారు. 'ఈ పుస్తకం నాది!' అనే వయస్సులో 'బాల నాది!' అన్నాడు సుందరాచారి. ఈ భావబంధంతోనే—బాలామణి, సుందరాచారి రచ్చబండమీది రావిచెట్టు, వేపచెట్టువలె జంటగా పెరిగినారు.

ఓనమాలు దిద్దుకొనే లేతవయసులోనే అమ్మను, నాయనను పోగొట్టుకున్న సుందరాచారిని అతని మేనమామ విశ్వనాథాచారి చేరదీసినాడు. ముగ్గురాడు పిల్లల తండ్రి విశ్వనాథాచారి యింట కొడుకువలె పెరిగినాడు సుందరాచారి. రెక్కాడితేనేగానీ డొక్కాడని సంసారం వాళ్లది. విశ్వనాథాచారి నమ్ముకొన్న కులవృత్తి ఒక్కటే అంతమందికీ కూడు పెట్టింది.

భ్రాతదార్లవంటి కళ్లద్దాలు పెట్టుకొని, తాను మాత్రమే కుంపటిముందు కూర్చొనేవాడు విశ్వనాథాచారి. ఎప్పుడైనా మేనల్లుడు దగ్గరికి వొచ్చి కూర్చుంటే 'నీకే పని వొద్దు. చదువుకో నాయనా!' అంటూవుండేవాడు.

సుందరాచారి ఎసెసెల్సీదాక చదువు

కున్నాడు. మరల చిత్తూరులో రెండేండ్లు పాటు సెకండరీ గ్రేడు ట్రెయినింగు చదివి, పరీక్ష ప్యాసైనాడు. డిస్ట్రిక్టు సెలెక్షన్ కమిటీవారి ఉత్తర్వుతో తన స్వంత పంచాయతీ సమితిలోనే ఉద్యోగ జీవితం ప్రారంభించినాడు. రెండేండ్లపాటు ఒకటిరెండు స్కూళ్లలో పనిచేసినాక, నెమిలికోనకు సింగిల్ టీచరుగా బదిలీ అయినాడు.

అప్పటికి పెద్ద పిల్లలిద్దరు పెండ్లిండ్లు జేసుకొని, కాపురాలకు వెళ్లిపోయినారు. దొంతిలో దాచిపెట్టిన దోరమామిడికాయ కలమాగినట్లు నిండుపరువంతో నవనవలాడుతూవుంది — మూడవఫారం చదివి నిలిచిపోయిన బాలామణి. మేనమామ రాసిన జాబు చదువుకొని, నోముల నెలలో యింటికి పోయినాడు సుందరాచారి. ఇంటి మెట్లెక్కుతూ వుంటే అనుకోకుండా ఎదుటబడిన బాలామణి అతన్ని జూచి తొలిసారిగా సిగ్గుపడి పారిపోయింది. సుందరాచారి పిచ్చివాడై పోయినాడు. అతని కనులకు ఆమె కొత్తగా, అంతకు ముందెప్పుడూ చూడని అప్సరసవలె కనబడింది. అన్నినాళ్లూ తపసుచేసి, దేవుళ్లను మెప్పించి, అందచందాలను, రూపలావణ్యాలను వరాలుగా పొంది, సుందరాచారిని ఉడుకాడించేందుకు ఎదురుచూస్తూ వుందా బాలామణి? ఇప్పుడామె బాలామణి గాదు; మోహిని!

తిరుచానూరు సత్రంలో, పెద్దలు చల్లిన అక్షంతలవానలో సుందరాచారిచేత బొట్టు కట్టించుకొని, అలిమేలు మంగమ్మకు మనసులోనే వేయిదండాలు పెట్టుకొనింది బాలామణి.

సుందరాచారి నెమిలికోనకు తిరిగివచ్చి, కాపురానికి తగిన ఇల్లు జూసుకొని, అవసరాలకు కావలసిన సామానులన్నీ వర్ద్ది పెట్టి, పెండ్లి అయిన మూడవనెలలో — సంక్రాంతి సెలవుల్లో ఇంటికిపోయినాడు. పెండ్లి అయినది మొదలు మూడవనెల వరకు ఆలుమగలను హద్దుల్లోనే పెట్టటం వాళ్ల యిళ్లల్లో సాంప్రదాయం. అన్నినాళ్లూ సుందరాచారి మహోవాక్యకర్మలా, బాలామణినే ఆరాధించినాడు. ఆమె లేని తన బ్రతుకు మిథ్య అనుకున్నాడు. ఇంక ఆమె కూడా అటులనే అనుకోవాలి అందులో సందేహానికి తావులేదు. మతాలు, శాస్త్రాలు జీవితాన్ని ప్రసాదిస్తాయి జీవితాన్ని సారవంతం చేస్తాయి.

పండుగ వేడుకలతో, శోభనపు ముచ్చట్లతో — విస్తరాకులో పిండివంటలవలె ఆ వారందినాలూ గడిచిపోయినాయి. ఆనాటి వేకువజామున తన కూతుర్ని అల్లుడివెంట నెమిలికోనకు సాగనంపుతూ ఆమె నొసట బొట్టుపెట్టి, బాలామణి తల్లి కనుల నీళ్లు పెట్టుకొనింది. 'కూతురా! నీ మామ ఉన్నవాడో, లేనివాడో! ఏమైనా లేదని మాత్రం ఏనాడూ అనుకోవద్దు! వాడి మనసు నీకుంది. ఆడదానికి అదే భాగ్యం!...సారెలేకుండా మొగుడి యింటికి పోతూవున్నానని చిన్నబోవద్దు. మనసున్న కాపురం, మచ్చలేని బతుకు—ఇవే ఆడది మగవాడికిచ్చే ఘనమైన కట్నాలు!'

* * *

కనులు మూసుకొన్న బాలామణి ముఖం ఎర్రబడింది. గొంతు వీణ తీగవలె ప్రకంపించింది.

'జంగముదేవరే జగమునేవత!
జంగముదేవరే సర్వేశ్వరుండు!'

...అనురాగం మిన్నేరువలె పొరలి పారుతూ, మనసులను ఊపివేస్తూవుంటే గౌరీశంకర శిఖరంమీద కొలువైన శివపార్వతులవలె లోకమే మరిచిపోయినారు బాలామణీ సుందరులు.

అదే సమయంలో సింగారపాళెం నుండి సైకిలు మీద వొస్తూ వున్నాడు అరడుగుల అబ్బాయినాయుడు వంకదాటి, మిట్ట ఎక్కుతూ వుంటే—ఎగిసపడిన జామపండువలె బాలామణి అతని కనులబడింది. గుచ్చుకున్న బాణం వలె ఆ చూపు ఆమె మీద అటులనే నిలిచి పోయింది. అబ్బాయినాయుడు దీప చూసుకోనే ఇరవై బారల దూరం సైకిలు తొక్కినాడు. సైకిలు చక్రాలు బొమదెబ్బ దగ్గర గతుకుల్లో తగులుకొని జర్రుమన్నాయి. కిందపడబోయిన అబ్బాయినాయుడు ఎటులనో నిలదొక్కుకొని, సైకిలు దిగినాడు. ఈ గడబిడ విని బాలామణి. సుందరాచారి ఉలికిపడి చూచినారు.

'నమస్కారం!' అన్నాడు సుందరాచారి సైకిలేస్తూ.

'నువ్వు సుందరాచారి ఊరి నుంచేనా?'

'అవునండి!'

'...ఎవరూ? మీ ఆడవాళ్లా?'

'అవును.'

'అయ్యో! నడచి వొచ్చినారా? బండి కట్టి తెమ్మని ముందే ఎవరితోనైనా చెప్పక పోయినావా? పాపం, ఆడోళ్లు ఎట్ల నడుస్తారనుకున్నావు? ఒకటా రెండా? నాలుగుమైళ్లు!...' అంటూ అబ్బాయినాయుడు పక్కకుతిరిగి, దూరంగా దేనికోసమో చూచినాడు. కనుచూపు దూరాన ఎడ్లబండి ఒకటి వొస్తూ వుంది. 'అదో! మన బండే వొచ్చేసిందిలే!... మీరు గూడా దానిలోనే ఎక్కరావొచ్చు.'

'ఎందుకులెండి! మూడుమైళ్లు రావే



కొచ్చినాము. ఇంకొక్క మైలే గదా?' అన్నాడు సుందరాచారి మొహమాట పడుతూ.

'అదేం సుందరాచారీ? బండిలేకుంటే సరే! ఉందిగదా మన బండి!... ఆమె


# రస్టన్

## హారిజాంటల్ ఇంజన్లు

- ఖర్చు తక్కువయైనవి
- మన్నికైనవి
- నమ్మకమైనవి
- సులభమైనవి






అమ్మేవారు మరియు సర్వీస్ చేయువారు
మెసర్స్. గ్రీవ్స్ కాటన్ & కం. లి.,
మద్రాస్. 1: సెకండ్ లైన్ బీచ్.
బెంగుళూర్-2: 78/1-ఎ. జయచామరాజేంద్ర రోడ్.
కోయంబత్తూర్-18: ట్రిచి రోడ్.
హైదరాబాద్-4: ఫతెమైదాన్ రోడ్.
RUS/67/2 TEL


# బాలామణి

నెక్కించేసెయ్యి. మనం నడిచి పోదాం.'

బండి దగ్గరికి వొచ్చింది. సేద్యగాడు బండి తోలుతూ వున్నాడు. అబ్బాయి నాయుడి భార్య, ఇద్దరు పిల్లలు, ఇంకెవరో ఇద్దరు ఆడవాళ్లు బండిలో వున్నారు. వాళ్లందరూ రాత్రి సింగార పాళెంలో సినిమా జూసుకొని, చుట్టాల యింట్లో పండుకొని, నెమిలికోనకు తిరిగి వొస్తూ వున్నారు.

'ఎక్కమ్మా!' అన్నాడు అబ్బాయి నాయుడు.

బాలామణి మొగుడి ముఖం చూచింది. ఎక్కమన్నట్టు తలాడించినాడు సుందరాచారి. ఆమె పెట్టెతో బండిలో కెక్కి కూర్చోనింది.

ముందు బండి సాగిపోతూ వుంది. వెనక చేతులూపుకుంటూ సుందరాచారి, సైకిలు తోసుకుంటూ అబ్బాయినాయుడు నడుస్తూ వున్నారు. గుచ్చుతున్న బాణాల వలె అబ్బాయినాయుడు చూపులు బండిలోవే వున్నాయి.

* * *

మూడంకణాల పూరిల్లు. ఆ యింట్లో సుందరాచారి పోగుజేసి పెట్టించదల్లా రెండు కొత్త చాపలు, రెండు దిండ్లు, రెండు కొత్త కడవలు, అయిదారు కొత్త కుండలు, ఒక మోపు కట్టెలు, వంటకు కావలసిన కొన్ని సరంజామాలు. పోగానే— బాలామణి ఇల్లు ఊడ్చింది. వెంట తెచ్చిన వెంకటేశ్వరుడి పటాన్ని గోడకు తగిలించి, దండం పెట్టుకొనింది. నడివీధిలో వున్న చేదబావిలో నుండి కడవతో నీళ్లు తెచ్చుకొనింది. పొయ్యి ముట్టించి, ఎసరు పెట్టి, వంటపనిలో మునిగిపోయింది. ఈ లోపల—అబ్బాయినాయుడు కొట్టించి పంపిన ఈతాకులతో పెరడు కట్టించినాడు సుందరాచారి.

ఆ సాయంతనం ప్రొద్దు గ్రుంకుతూ వుండగా—సుందరాచారి యింటికి వొచ్చినాడు గురప్ప. సుందరాచారి, అబ్బాయినాయుడు యిద్దరూ చాప మీద కూర్చొని కాఫీ తాగుతూ వున్నారు. పశువులతో గలిసి పులి కసవు మేస్తూ వుంది. 'ఎప్పుడూ రాడే — ఈ దొంగనాయాలిక్కడికెందుకొచ్చినట్టు?' అనుకున్నాడు గురప్ప.

గురప్ప తొమ్మిదో తరగతివరకు చదువుకొని, మూడేండ్ల కిందట వాళ్లనాయన కాలమైపోగా, పొలం పనులు చూసుకునే దిక్కులేక మానుకున్నాడు. ఇంతవరకు నెమిలికోనకు వచ్చి పనిచేసిన టీచర్లందరిలోకి సుందరాచారే అతనికి దగ్గరివాడైనాడు. సుందరాచారి మంచివాడు. బడి గోడలమీది మంచి మాటల్ని బాగా ఒంటబట్టించుకున్నవాడు.

గురప్పకు అబ్బాయినాయుడంటే — మనసు మారుమూలల్లో చెప్పలేనంత అసహ్యం. వాడిలో మంచిలేదు. దయాదాక్షిణ్యాలు లేవు. నీతి, న్యాయం లేని రాజోద్యోగి మనస్తత్వం వాడిది. తప్పులు, దోషాలూ నెమిలి కన్నులవలె వాడి బతుకంతటా నిండిపోయినాయి.

నెమిలికోన, ఆ ప్రాంతాల్లో అందరికంటే పచ్చగా వున్నవాడు అబ్బాయినాయుడు. వాళ్లనాయన బాగా సంపాదించి ఏమీ ఎత్తుకొనకనే పోయినాడు. మార్కులు సంపాదించుకోలేక ఎసెసెల్సి ఫెయిలయిన అబ్బాయినాయుడు ఆస్తి వ్యవహారాలు చూసుకుంటూ బాగా డబ్బు సంపాదిస్తూ వున్నాడు. నెమిలికోన పంచాయతీబోర్డు ప్రెసిడెంటుగిరీ అతని తండ్రికేవుండేది. అది కూడా వంశపారంపర్యమైన హక్కువలె, తండ్రి పోయినవెనుక అతనికే దక్కింది. 'చదువుకున్నవాడివి, డబ్బున్నవాడివి, నలుగురితో మాట్లాడగలిగినవాడివి. నువ్వే వుండు!' అన్నారు మెంబర్లు.

ఆ ప్రెసిడెంటు పట్టం కూడా అబ్బాయినాయుడి సంపాదనకు ఇంకా బాగా పనికివచ్చింది. అతనికి ఎవరిమీదా పాపభీతి లేదు. మాటలు మర్యాదగా వుండవు. అయ్యవార్లంటే చులకన. సుందరాచారి నెమిలికోనలో వున్న ఈ మూడు నాలుగు నెలల్లోనూ — అబ్బాయినాయుడు అతనితో స్నేహంగా ప్రవర్తించనే లేదు. అతనితో మాట్లాడిన రెండుమూడు సంగర్భాల్లోనూ—అనాదరణ, అమర్యాద— ఇవే బయటపడినాయి. అటువంటి అబ్బాయినాయుడు ఇప్పుడిక్కడెందుకున్నాడు? సుందరాచారితో ఈ సహవాసం ఏమి?

గురప్పకు సుందరాచారిపైన కోపం వొచ్చింది. అతనికి తెలియదా? తాను

చెప్పవలెనా? అది మర్యాద కాదుగదా!... బాలామణి గురప్పకు కాఫీ యిచ్చింది. గురప్ప కాఫీ తాగి, లోటా ఆమె చేతి కిచ్చి 'అక్కా!' అన్నాడు. 'అక్కా! అయ్యవారు చాలా మంచివాడు! అయినా, మరీ ఇంత మంచితనం పనికిరాదు.' అని చెప్పాలనివుంది. అయితే సుందరాచారి, అబ్బాయినాయుడు అక్కడనే వున్నారు. 'పోతానక్కా.' అని వెళ్లిపోయినాడు గురప్ప.

గురప్ప పోయిన కొంతసేపటికి బాలామణి గబగబా పెరట్లోకి నడిచిపోయి, అక్కడ వాంతి చేసుకొనింది. సుందరాచారి ఆమె వెనుకనే వెళ్లి, 'ఏమి బాలామణీ? ఏమైంది?' అన్నాడు ఆత్రంగా.

'ఏమీ ఫరవాలేదు మామా! కనులు తిరిగినాయి. అంతే!' అనింది బాలామణి. అబ్బాయినాయుడు ఆ మాట విన్నాడు. లేచి, వీధిలో పరుగెత్తుతూ వున్న ఒక పిల్లవాణ్ణి పిలిచి 'ఒరే! పోయి, పరదేశి వుంటే ఇక్కడికి రమ్మని చెప్పు. నేను రమ్మంటూ వున్నానని చెప్పు!' అన్నాడు

పరదేశిని అందరూ ఆడంగివాడు అంటారు. అతనికి హద్దులూ, అడ్డాలూ లేక అందరివలెనే తింటాడు. అందరివలెనే నిద్రపోతాడు. అయితే పనీపాటూ ఏమీ చేయడు. అతను చిన్న చిన్న రోగాలకు మందులిస్తాడు. మంత్రాలు వేస్తాడు. స్త్రీ వశీకరణం నాకు తెలుసునంటాడు. అయితే చెప్పనంటాడు. అతని బతుకు యిటులనే గడిచిపోతూవుంది.

పరదేశి వొచ్చినాడు. బాలామణి చేయి పట్టుకొని, నాడి పరీక్షించినాడు. 'ఆఁ, ఏముంది? ఎండలో నడిచి వొచ్చింది కదా?... పైత్యం జేసింది. ఆ పైన దిష్టి గూడా బాగా తగిలింది. ఒకటే మంత్రానికి అంతా ఎగిరిపోతుందిలే!' అన్నాడు. పొరువేటలో పొట్టేలును కాల్చేంత ఏకాగ్రచిత్తంతో వేపాకుతో మంత్రించినాడు. 'చీకట్లైపోయింది. నేను వస్తాను సుందరాచారీ! జాగర్త!... పద పరదేశీ!' అన్నాడు అబ్బాయినాయుడు. ఇద్దరూ వెళ్లిపోయినారు.

ఊరంతా నిద్రకుపక్రమించిన వేళ — సుందరాచారి బాలామణి నుదురు మీద చేతితో నిమురుతూ 'ఇప్పుడెట్లుంది బాలామణీ?' అని అడిగినాడు.

'బాగుంది మామా.'

'మంత్రం పని జేసిందా?'

'కాదు! నీ చేతి చలవే!'

* * *

సుందరాచారితో అబ్బాయినాయుడి స్నేహం సాయంకాలపు నీడలాగే గబగబా పెరిగిపోయింది. కనీసం రోజుకొక సారైనా ఇంటికి వొచ్చి పోతూ వున్నాడు అబ్బాయినాయుడు. 'సుందరాచారి లేడా?' అని బాలామణి నడిగి, ఆ వెనుకనే బడి దగ్గరికి పోతూ వున్నాడు.

రిపబ్లిక్ దినోత్సవం నాడు సుందరాచారి ప్రెసిడెంటు అబ్బాయి నాయుడి చేతనే జెండా ఎగురవేయించినాడు. అబ్బాయినాయుడు పిల్లల నుద్దేశించి ఇటుల మాట్లాడినాడు. 'మనది భారతదేశం. మనమంతా భారతీయులం. నేటి బాలలే రేపటి పౌరులు. మీరంతా పెరిగి పెద్దవాళ్లై, గాంధీ, నెహ్రూల మాదిరిగా మనదేశానికి పేరు తేవాల! భారతమాతాకు జై! మహాత్మా గాంధికి జై! జవహర్లాల్ నెహ్రూకు జై!'

పిల్లకాయలకు మిఠాయిలు పంచిపెట్టి, యిండ్లకు పంపించి వేసిన తరువాత 'సింగారపాళెం పోయి వద్దామా సుందరాచారీ?' అన్నాడు అబ్బాయి నాయుడు.

'పనుంటే పోదాం!'

'మండీలో డబ్బు రావాల! అది తీసుకొని, మాపటి వేళకల్లా వొచ్చేద్దాం.'

'నేనూ మీతోనే! నాకు మాత్రం వేరే పనేముంది?' అన్నాడు పరదేశి.

సుందరాచారి బాలామణితో చెప్పి బయలుదేరినాడు. 'సరసంగా వుంటే చిన్న అండా ఒకటి తీసుకొని రా మామా! నీళ్లు కాచుకునేందుకు!' అనింది బాలామణి.

'జానాను!' అన్నాడు పరదేశి.

ముగ్గురూ నడకమీదనే సింగారపాళెం పోయినారు. మండీలో రావలసిన డబ్బు లెక్కపెట్టి తీసుకున్నాడు అబ్బాయినాయుడు. మధ్యాహ్నం హోటలులో భోజనం చేసినారు. కొంతసేపు బస్‌స్టాండు దగ్గర గడిపినారు. అది అబ్బాయినాయుడి సరదా. సాయంకాలం కాబోతూ వుండగా పాత్రల అంగడిలోకి పోయినారు. ఒక నడి సైజు హండా చూపి వెల అడిగినాడు సుందరాచారి. అరవై రూపాయలు చెప్పినాడు అంగడివాడు

'పోదాం పద నాయుడూ! ఇంకొకసారి వొచ్చినప్పుడు తీసుకోవచ్చు!' అన్నాడు సుందరాచారి. అతని జేబులో ముప్పై రూపాయలే వున్నాయి.

'వొద్దంటే ఎట్లసార్? అండా తీసుకొని రమ్మని బాలమ్మ చెప్పింది గదా? బానలో ఎన్నాళ్లు కాచుతుంది? కొనుక్కోండి!' అన్నాడు పరదేశి

'అదికాదు పరదేశి...'

'డబ్బు చాలదనేనా సుందరాచారీ?



**ఫోల్డింగ్ 50 షాట్ పిస్టల్**

లైసెన్సు అక్కరలేదు. అమెరికన్ మోడల్. దొంగలు, క్రూరమృగముల నుండి రక్షించుకోండి. ఉల్లాస ప్రయాణాలు, షూటింగులు, నాటకాలకు పనికివచ్చినది.




ఆటోమేటిక్ 50 షాట్లు పేల్చుటుగలదు తేలికైనది. ఇందు నుండి వెలువడు పెద్ద శబ్దాలు మిమ్ముకాపాడును. ధర 50 షాట్లు నెం 33 రు 13/50. జర్మన్ మోడల్ నెం. 99 రు. 15/50. వి.పి.పి. ఛార్జీలు రు. 2/50. లెదర్ కేస్ రు.7/-అదనపుషాట్లు 100కి రు. 5/-

GEM ARTS (WAPM-15)
P. Box 1325, Delhi-6

**రు. 20కి గడియారం పొందండి**

మాచే క్రొత్తగా కనిపెట్టబడిన స్కీము ద్వారా రు. 147 విలువగల మా రోమర్ పాపులర్ వాచీని రు. 20 లకే పొందండి.



నేడే మీ ఆర్డరు పంపండి.

Romer Agencies, (AP-15)
Box 1441, DELHI-6.

**వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టర్**

రు: 320/- విలువగల ప్రపంచ ప్రఖ్యాతిగల 'ఎస్కార్ట్' 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ పోర్టబుల్



ట్రాన్సిస్టర్ నెలకు రు.10/- వంతున వాయిదాలపై చెల్లించి పొందండి. ఇండియాలోని ప్రతి పట్టణ, పల్లెలకు పంపెదము. వ్రాయండి.

JAPAN AGENCIES, (AP 10)
Post Box 1194, Delhi-6.

**ఉత్తరాలు రాసేవారికి మనవి:** ఉత్తరాలు వీలయినంత చిన్నవిగా ఉండాలి! కాగితానికి ఒకవయిపునే రాసి ఉండాలి. రాసినవారి పేరు, చిరునామా తెలుగు అక్షరాలలోనే రాయాలి. వీలయినంత దాకా ఇంగ్లీషు, ఇతర భాషల అక్షరాలు వాడవద్దని లేఖకులకు మనవి చేసుకుంటున్నాము. (సం)

# బాలామణి

పెద్దడబ్బు! అవసరానికి పనికిరాకపోతే ఈ డబ్బుదేనికి?... ఇయ్యవయ్యా ఆ అండా!' అంటూ నూరురూపాయలనోటు ఒకటి తీసి సుందరాచారి చేతిలో పెట్టినాడు అబ్బాయినాయుడు.

'వద్దు నాయుడూ! ఇప్పుడే కొనుక్కోవాలని ఏముంది?' అంటూ సుందరాచారి ఆనోటు తిరిగి ఇయ్యబోయినాడు.

'ఇదో, నాకు కోపమొస్తుంది.'

సుందరాచారి కాదనలేకపోయినాడు.

'మంచిబిందె కూడా ఒకటి తీసుకోండి సార్! అయ్యవారమ్మ సంతోషపడుతుంది' అన్నాడు ప్రదేశి.

నూరురూపాయలుపెట్టి హండా, బిందె కొనుక్కొని బయటకు వొచ్చినారు ముగ్గురూ. జేబులోవున్న మున్పయ్యాతీసి అబ్బాయినాయుడి కీయబోయినాడు సుందరాచారి.

'ఫరవాలేదు పెట్టుకోవయ్యా స్వామీ! నీదగ్గర ఎక్కడికి పోతుంది? నాకిప్పుడు అవసరంలేదు!' అన్నాడు అబ్బాయినాయుడు.

ఊరిచివర వడ్లమిల్లు దగ్గరికొచ్చినారు. వడ్లు దంపించుకొని ఎవరిదో ఎడ్లబండి నెమిలికోనకు పోతూవుంటే — హండా, బిందె బండిలోపెట్టి, సుందరాచారి యింటిలో యిమ్మన్నారు. హోటలులో టిఫినుతిని, కాఫీత్రాగి, చీకటి పడేసరికి నెమిలికోన చేరుకున్నారు.

సుందరాచారి యింటికిరాగానే 'ఎంతయింది మామా వీటికి?' అని అడిగింది బాలామణి.

'నూరు!'

'ఎక్కడివి?'

'నాయుడిచ్చినాడు.'

'ఎందుకు కొంటివి మామా యివి? బుద్ధిలేనిదాన్ని—సరసంగావుంటేతెమ్మంటిని గానీ, అప్పుజెయ్యమంటినా?'

'ఏం జెయ్యమంటావు చెప్పు? వొద్దంటే వింటేగదా? ... మంచినాయుడబ్బా! బలే మొండితనం!' అంటూ నవ్వినాడు సుందరాచారి.

మట్టికుండలే మేలనిపించింది బాలామణికి.

* * *

అన్ని నెలల్లోనూ ఫిబ్రవరి చిన్ననెల. అయితే అది ఈసారి బ్రహ్మాండమంత సంబరంతోనే వొచ్చింది జనరల్ ఎలక్షన్ల ప్రచారాలహోరు పల్లెలనిండా కమ్ముకొనింది. అబ్బాయినాయుడికి నిమిషం తీరుబాటులేదు. ఫలానా గుర్తుకే ఓటుముద్ర వేయండంటూ జీపుల్లో ఊరూరా తిరుగుతూ వున్నాడు. అయినా — ఇంటికి అన్నానికి రానివేళలైనా వున్నాయికాని, బాలామణిని దర్శించుకోని దినంమాత్రం లేదు.

జీతం రాగానే సుందరాచారి అబ్బాయినాయుడికి నలభైరూపాయ లియ్యబోయినాడు. 'ఇప్పుడు నాకు అవసరమేముంది సుందరాచారీ? నువ్వే ఖర్చుపెట్టుకో!' అన్నాడు అబ్బాయినాయుడు. అతన్ని సింగారపాళెం తీసుకొనిపోయి, ఆ డబ్బుతో పరుపు, దుప్పట్లూ కొనిపించినాడు.

ఎన్నికలరోజు దగ్గరపడింది. సుందరాచారిని పోలింగ్ ఆఫీసరుగా సింగారపాళేనికి వేసినారు. పదునైదవతేదీన ఎన్నికలు. అయితే అతను పద్నాలుగోతేదీ మధ్యాహ్నానికే సింగారపాళెం చేరుకోవాల! ... అబ్బాయినాయుడికీ సంగతితెలిపి, బాలామణితోచెప్పి, ఆరోజు సింగారపాళెం వెళ్ళిపోయినాడు సుందరాచారి.

తెల్లవారితే ఎన్నికలు. నెమిలికోన స్కూలు కూడా ఎన్నికల కేంద్రంగా మారిపోయింది. అబ్బాయినాయుడు ఆ పగలూ, రాత్రీ నెమిలికోనకు సంబంధించిన పల్లెలన్నీ తిరిగివొచ్చినాడు. రాత్రి నడిజాము వరకు భజనదేవళం ముందు అరుగుమీద కూర్చొని ఊరిపెద్దలతో ఎన్నికల కబుర్లలో మునిగి తేలినాడు.

ఈదురుగాలి చురుక్కుమని పొడుస్తూ వుంటే, కనులు నిద్రతో కూరుకొనిపోతూవుంటే,—దేవళంముందు కూర్చున్న వాళ్ళంతా లేచి ఇండ్లకు వెళ్ళిపోయినారు. అబ్బాయినాయుడు కూడా లేవగానే వీధి నిర్జనమైపోయింది.

(ముగింపు పై వారం)

(గత సంచిక తరువాయి)

అబ్బాయినాయుడు ఆవలించినాడు. ఒళ్ళు విరుచుకొన్నాడు. బాలామణి ఇంటి దగ్గరికిపోయి, తలుపుదగ్గర నిలబడినాడు. అతని వేళ్ళు తలుపుమీద టకటక లాడినాయి. 'బాలమ్మా! బాలమ్మా!'

లోపల అలికిడైంది. 'ఎవరు?'

'నేను బాలమ్మా! ఒకసారి తలుపు తియ్యి!'

తెరుచుకుందామా, వద్దా అని కొంత సేపు సందేహించి, కొద్దిగా తెరుచుకొనింది తలుపు. తలుపుసందున లాంతరు మసక వెలుతురులో నిద్రకండ్లతో బాలామణి కనిపించింది.

'ఏమన్నా! నువ్వా!'

'నేనే బాలమ్మా! సుందరాచారి లేడా?' అంటూ తలుపునెట్టుకొని లోపల అడుగుపెట్టినాడు అబ్బాయినాయుడు.

'సింగారపాలేనికి పోయినారు కదా!'

రెండుక్షణాలు గడిచినాయి.

'ఏమన్నా?'

అబ్బాయినాయుడు నీళ్ళు నమిలినాడు ... 'ఏమీలేదు బాలమ్మా! ... నీ ఓటెవరికి?'

'నాకు ఓటెక్కడుందన్నా?'

'ఓటు లేదా? ఎందుకులేదు?' అన్నాడు అబ్బాయినాయుడు. తలుపు మూసి, అడ్డంగా నిలబడినాడు. 'పోనీ, నీ మనసులో చోటెవరికి?' అంటూ లేత పిచ్చివాడివలె వెకిలిగా నవ్వినాడు.

'అన్నా! అదేంమాట?' అనింది బాలామణి ఉలికిపడి.

'ఉన్నమాటే బాలా! తెలియనట్లు అడుగుతావేల? నువ్వు నన్ను పిచ్చివాణ్ణి జేసినావా, లేదా చెప్పు! నా కలల్లోకి వొచ్చి, నా నిద్రను పాడుజేస్తూ వున్నావా, లేదా చెప్పు! నీ మనసు నా మీదవుందా లేదా చెప్పు! కడపటికి ఈ దినం దేవుడు దయతలిచినాడు. ఇంక ఓట్లు వాలుతే!'

బాలామణి రాతిబొమ్మైపోయింది. 'అన్నా! నేను అట్లాంటిదాన్ని కాను! నాకు అన్నలూ, తమ్ముళ్ళూలేరు. నిన్ను నా తోడబుట్టినవాడవే అనుకున్నాను. అటువంటి పాపపు మాటలనవద్దు!'

'భయమెందుకు బాలా? ఇక్కడెవ




రున్నారు? ఊరంతా నిద్రపోయింది. ఎవరికీ తెలియదు!'

'ఛీ దున్నపోతా! నోరుముయ్!'

'బాలా! నువ్వు తిట్టినా ఫరవాలేదు. నన్ను కాదంటే మాత్రం నేను బతకలేను.' అంటూ అబ్బాయినాయుడు ఆమెను రెండుచేతులతోనూ పొదివి పట్టుకున్నాడు. తన బాహువల్లరులతో ఆమెను కొండచిలువవలె చుట్టివేసినాడు. బాలామణి పెనగులాడి పెనగులాడి దేవదత్తమైన మహాశక్తితో అతని పట్టునుండి విడిపించుకొని, లేడివలె ఎగిరి, మూలనున్న కాయగూరలు తరిగే కత్తిని అందుకొనింది. ఆ కత్తితో నుదుటిమీద గాటుపెట్టుకొనింది. నెత్తురు బొటబొటమని ముక్కుమీదుగా జారింది. 'ఎంత పదునుగావుందో చూచినావా?' అనింది బాలామణి.

అబ్బాయినాయుడు మ్రాన్పై నిలబడిపోయినాడు.

ముడివిడిపోయి వేలాడే నల్లని వెంట్రుకలు, నెత్తురోడే ప్రశాంతమైన ముఖం, కనులలో నిప్పులు చెరిగే కోపం — చీకటి గుడిలో చమురు దీపం వలె వుంది బాలామణి.

'తెలుసుకో! బాలామణి నిప్పులాంటిది. నా మీద నీకుండే ఆశైనా మిగలాలను కుంటే ఇక్కణ్ణుంచి పో ముందు! మానం నా చేతుల్లో వుంది. దానికోసరం నిన్ను బతిమాలను. నా ప్రాణం మాత్రం నీ చేతుల్లోనే వుంది. అదంటే నాకు లెక్కలేదు. పోతావా, పోవా?'

అబ్బాయినాయుడు చేసేది లేక, పిల్లి వలె అడుగులు వేసుకుంటూ గడపదాటి వెళ్లిపోయినాడు. బాలామణి తలుపు గడియ వేసి, భోరుమని ఏడ్చింది. ఆ రాత్రంతా ఆమెకు కంటి మీద కునుకులేదు.

'బాలమ్మా! నీ ఓటెవరికి?'

'నీ పవిత్రమైన ఓటు ఎవరికి?'

'అన్నిటికంటే పవిత్రమైనదా ఓటు? అయితే—ఈ దేశంలో పుట్టిన ఆడదానికి మానమే ఆ ఓటుకంటే పవిత్రమైనది. అన్నలారా! ఆడదాని మానానికి కంచుకోట గట్టే మానసంరక్షకుడు మీలో వున్నాడా? వుంటే చెప్పండి!... వాడికే నా పవిత్రమైన ఓటు!'

* * *

ఎన్నికల్లో ఎవరు గెలిస్తేనేమి, మనిషి మాత్రం మారలేదు. అబ్బాయినాయుడి మనసూ మారలేదు. నెమిలికోనలో—ఎన్నికలు తెచ్చిన మార్పు ఒక్కటే! సుందరాచారితో అబ్బాయినాయుడి సహవాసం ఎంత తొందరగా పెరిగి పెద్దదైందో, మరలా అంత తొందరగానే తరిగి చిన్నదైంది. అతను సుందరాచారి యింటికొచ్చే అలవాటే మానుకున్నాడు. దూరదూరంగా వుండిపోతూ వున్నాడు. అతని మాటలలో వెనుకటి ప్రేమాదరాలు మాయమై, మునుపటి అమర్యాద, అవహేళన విశ్వరూపం ధరించినాయి. అయినా సుందరాచారి మాత్రం 'దొరల చిత్తం మా కుల ప్రాప్తం' ... 'దొరల చిత్తం మాకుల సిద!' అనుకొని, తనపని తాను చేసుకొని పోతూ—వున్నాడు.

నెత్తిమీద కత్తిగోతకు ఏదో సాకు చెప్పుకొనింది బాలామణి. అబ్బాయినాయుడి ఆగడాన్ని గురించి ఆమె మగడికి చెప్పుకోలేదు. అతనికి చెప్పి పరిస్థితులు యింకా ముదరబెట్టుకునేందుకు ఆమె భయపడింది. ఏదైనా ఇంకొక వూరికి బదిలీ చేయించుకొమ్మని అతని చెవిలో ఇల్లుగట్టుకొని పోరుబెట్టి సాగింది. సుందరాచారి పరేశాని బదిలీ కోసరం అప్లికేషను రాసి పడేసినాడు.

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడెన్‌సా
ఉపశమనము పొందండి
—శస్త్రచికిత్స
అవసరముండదు!
DOL-327 TEL

షూటింగ్ 50 షాట్ పిస్టల్
లైసెన్సు అక్కరలేదు. అమెరికన్ మోడల్. దొంగలు, క్రూరమృగముల నుండి రక్షించుకోండి. ఉల్లాస ప్రదర్శనాలు, యాత్రలు, నాటకాలకు పనికివచ్చేది.
ఆటోమేటిక్ 50 షాట్లు నిర్మాటుగలదు తేలికైనది. ఇందు నుండి వెలువడు చప్పుడు మిమ్ములను కాపాడును. ధర: 50


షాట్లు నెం.33 రు 13/50. జర్మన్ మోడల్ నెం. 99 రు. 15/50. వి.పి.పి. ఛార్జీలు రు. 2/50. లెదర్ కేస్ రు. 7/-అదనపుషాట్లు 100కి రు. 5/-
GEM ARTS (WAPM-15)
P. Box 1325, Delhi-6

3 నెలలు ఉచిత బహుమతి.
స్త్రీలకు అందాన్నిచ్చే కాశ్మీర్ ఆర్ట్ చీరెలు: సరికొత్త ఆకర్షణీయమైన నమూనాలలోను రంగులలోను ఋతువులకు తగినట్లు మావద్ద గలవు. పెద్ద సైజులలో మాత్రమే లభించును. 1కి లక్స్-చీరెరు. 11లు; 2 రు.20లు; 3 కి రు. 28లు; 4 రు. 36/- రెండు లేక అంతకు పై చీరెలకు ఆర్డరు పంపిన వారికి బ్లౌజు గుడ్డ ఉచితం మీ ఆర్డరును పోస్టు పార్సిల్ ద్వారా పంపెదము.

ARVIND AGENCIES (APW-22)
P. B. 1408, Delhi-6.

# బాలామణి

బాలామణికి బతుకు దినగండం నూరేండ్లాయుస్సుగా వుంది. అబ్బాయినాయుడే పరదేశి రూపంలో వొచ్చి ఆమెను బాధిస్తూ వున్నాడు. బాలామణి దగ్గర అబ్బాయినాయుడి వూసెత్తటమే ఈ నడుమ పరదేశికి ఉద్యోగమై పోయింది.

ఒకనాడు, సుందరాచారి బడిలో వున్న సమయంలో—పరదేశి వాళ్ల యింటికి వచ్చినాడు. 'చీటీ నీకియ్యమన్నారు బాలమ్మా!' అన్నాడు. బాలామణి దాని నందుకొని ఇటులు చదివింది. 'నా ప్రియమైన బాలామణికి శతకోటి ముద్దులు! నీ కోసరం నేను అల్లాడిపోతూ వున్నానే, నీకింకా దయరాలేదా? నీతో ఒక్కసారి...' బాలామణి కోపంతో, అవమానంతో బుసలు గొడుతూ, ఆ కాగితాన్ని నలిపి పొయ్యిలోకి విసిరేసింది. ఆ కాగితానికి ప్రాణం వొచ్చి పలికినట్లు మిగతా పరదేశి అందుకున్నాడు '...గడిపితే చాలు, నరకానికి పొమ్మన్నా పోతాను. ఈ తాపం నేను ఓపలేను. కనులు మూసినా, కనులు తెరచినా నువ్వే! నన్ను కనికరించు! నాకు ప్రాణభిక్ష పెట్టు! ఈ రాత్రికి...' అంటూ అపహ్యంగా నవ్వుతూ వున్నాడు పరదేశి.

'పరదేశి! చాలింక! తగ్గు! ...' అంటూ—ఎక్కడో ఆకాశంలోని పురుము వలె చిన్నకేకపెట్టింది.

'నామాట విను బాలమ్మా! నీ మంచి గోరేవాణ్ని! అబ్బాయినాయుడెంతో మంచివాడు. బుణం పెట్టుకునే మనిషిగాదు. నువ్వు సైయ్యన్నావంటే—సిరి నీకాళ్లమీద పడుతుంది. అదృష్టాన్ని కాలదన్నుకోకు!'

వాడి గొంతు నులిమేద్దామనిపించింది బాలామణికి.

'మర్యాదగా బయటికిపో, ఎంగిలితినే కుక్కా!...ఇంక వీరాదట ఇటువంటి కూతలు గూసినావంటే మాయింటాయ యనతో చెపుతాను' అని కసురుకొనింది.

'చెప్పుకో! భయపడేవాళ్లెవరు? ఒకటి మాత్రం జ్ఞాపకంపెట్టుకో! అబ్బాయినాయుణ్ణి కాదని, బాగుపడినవాళ్లు లేరు!' అని చెప్పి వెళ్లిపోయినాడు పరదేశి.

బాలామణి బెదిరిపోయింది. పరదేశి ఆమె కంటికి అడంగివానివలె కనబడలేదు. ఆమె పాలిటికి రాక్షసుడైనాడు.

మార్చినెలలో బాలామణి తల్లిదండ్రులు కూతుర్ని, అల్లుణ్ణి చూచిపోదామని వొచ్చినారు. రెండురోజులుండి వెళ్లిపోయినారు. సుందరాచారి వాళ్లకు కొత్త గుడ్డలుపెట్టి పంపినాడు. సింగారపాళెంలో వాళ్లను బస్సెక్కించి తిరిగొచ్చేసరికి పొద్దుపోయి చీకటిపడింది. ఇంటిదగ్గర పరదేశి కాచుకొని వుండినాడు.

'ఏం పరదేశి?' అన్నాడు సుందరాచారి.

'అబ్బాయినాయుడు డబ్బడిగి రమ్మన్నాడు సార్!'

సుందరాచారి మనసు బరువెక్కింది. 'వొచ్చినజీతం వొచ్చినట్లే ఖర్చయి పోయింది పరదేశి!...ఇప్పుడు బొత్తిగా డబ్బులేదు. వచ్చేనెల—జీతంరాగానే యిచ్చుకుంటానని చెప్పు!'

'ఏమో, చెప్పమన్నారు, చెపుతాను.'

శివరాత్రితో చలి శివశివా అని వెళ్లిపోతుందంటారు. శివరాత్రి కూడా వెళ్లిపోయిందిగానీ, చలిపోలేదు చలికి శాలువ గప్పుకొని, మిద్దెమీద పచార్లుచేస్తూ వున్నాడు అబ్బాయినాయుడు. బాలామణిని దుప్పటిగాజేసి కప్పుకుంటేనేగానీ అతని తీరదు.

మిద్దెపైకివొచ్చి, 'అబ్బా?' అన్నాడు పరదేశి

'డబ్బడగగనే ఆకుమాదిరిగా అల్లాడిపోయినాడు. రేపు నెలజీతం రాగానే యిస్తానని చెప్పమన్నాడు.'

'మనకు కావలసిందదే! డబ్బుగాదు!' అంటూ బీడీ ముట్టించుకున్నాడు అబ్బాయినాయుడు.

బాలామణి తనకు అందని చందమామై పోతూవుంది. ఆ ఆశ తలవాల్చేసినప్పుడల్లా అతనిలో పగ రగులుకొంటూ వుంది. అన్నిప్రయత్నాలూ అడుసులో నాటిన కంబాలైపోయినాయి. బాలామణి తనను తిరస్కరించింది. మొగుడిచేత బదిలీకోసరం అర్జీపెట్టించింది. ఏప్రిలు నెల రాబోతూవుంది. ఆ వెనుక ఎండాకాలపు సెలవులొస్తాయి. బాలామణి వెళ్లిపోతుంది. మరల నెమిలికోనకు రాకనేపోవచ్చు. తనకు బాలామణివుండదు. సుందరాచారికి బాలామణి స్థిరాస్థి! తాను దరిద్రుడు. సుందరాచారి కుబేరుడు.

'సుందరాచారీ!' అంటూ పండ్లు పటపట కొరికినాడు అబ్బాయినాయుడు.

'ఏప్రిల్ నెల మొదటివారంలో సుందరాచారికి జీతం అందింది. ఆ మధ్యాహ్నం యింటి దగ్గరికే వొచ్చి డబ్బిచ్చిపోయినాడు తపాలావాడు. 'మామా! ముందు ఆ అప్పు తీర్చివేయి. ఈ కమ్మలు కుదువబెట్టి, ఈనెల గడుపుకోవచ్చు...ఇంద!' అని బాలామణి చెవులకున్న కమ్మలు తీసి అతనిచేతిలో పెట్టింది.

సుందరాచారి చొక్కా వేసుకొని, వీధిలోకి వచ్చినాడు. 'పరదేశీ! డబ్బియ్యమంటావా?'

'ఏమిడబ్బు సార్?'

'అబ్బాయి నాయుడికీయవలసిన డబ్బు!'

'ఆపీడ నాకెందుకు సార్! మీరే ఇచ్చుకోండి!' అంటూ పరదేశి వీధి చివరి వరకూ పోయి, సీనయ్య చిల్లరంగడి అరుగు మీద కూర్చున్నాడు.

అబ్బాయినాయుడి ఇంటిదగ్గరికి పోయినాడు సుందరాచారి. ఇంట్లో ఎవరూ లేరు. సింగారపాళెంలో పెండ్లికిపోయినారని తెలిసింది. సుందరాచారి బడికి వెళ్లిపోయినాడు. ఒక పిల్లవాణ్ణి పంపి గురప్పను పిలిపించినాడు.

'తాకట్టు మీద డబ్బిచ్చేవాళ్లెవరున్నారు గురప్పా?'

గురప్ప కొంతసేపు కన్నులార్చినాడు. 'సింగారపాళెంలో మార్వాడీ వాళ్ళున్నారు సార్!'

'సింగారపాళెం ఎప్పుడు పోతావు నువ్వు?'

'మీరు పోయిరమ్మంటే, రేపు పోతాను.'

'అయితే, రేపు తెల్లారి ఒకసారి నాకు కనిపిస్తావా?'

సరేనని గురప్ప వెళ్లిపోయినాడు.

పాఠం చెపుతూవుంటే – చిల్లరంగడి సీనయ్య బడిలోకి వొచ్చినాడు 'జీతం వొచ్చిందని విన్నాను సార్! డబ్బుగావాల!'

'రేపిస్తాలె సీనయ్యా!'

'ఎప్పుడైనా మిమ్మల్ని ఇట్లడిగినానా సార్! ప్రాణం మీదికొచ్చింది. అపతల అప్పులవాడొచ్చి కూర్చున్నాడు. ఇప్పుడు మీరియ్యకపోతే, నా మానం పోతుంది.' అంటూ ఎప్పుడూ లేనిది, మొండిపట్టు పట్టినాడు సీనయ్య. అతనికీయవలసిన ముప్పైఅయిదు రూపాయలూ ఇచ్చివేసినాడు సుందరాచారి. పాయంత్రం ఉసూరుమంటూ ఇంటికి వొచ్చినాడు. అసుర సంధ్యవేళ చాపవేసుకొని పండుకొన్నాడు. బాలామణి అతనితల వాకిట్లో కూర్చొనింది.

గుండె ఝల్లుమనేట్టుగా 'సుందరాచారీ!' అనేపిలుపు వినిపించింది వీధిలో నుంచి. సుందరాచారి లేచి వాకిట్లోకి తొంగిచూచి 'రా నాయుడూ! లోపలికిరా!' అని పిలిచినాడు.

'ఫరవా లేదు. వీధిలోకేరా!' అన్నాడు అబ్బాయి నాయుడు అతని పక్కన పెద్దవాళ్లిద్దరు నిలబడి వున్నారు.

సుందరాచారి వీధిలోకి పోయినాడు.

'డబ్బేదీ?'

'నీకోసరం వెతికినాను నాయుడూ! నువ్వు కనబడలేదు.'

'మరిలేం? డబ్బియ్యి!'

'ఎనభై రూపాయలున్నాయి. తీసుకో నాయుడూ!...మిగిలింది రేపిస్తాను...'

'అదేం కుదరదు! నూరు రూపాయలు ఇప్పుడే గావాల.' అబ్బాయి నాయుడి గొంతు కంచుగంటవలె గింగురుమనింది. వీధిలోని ఆడా మగా సుందరాచారి ఇంటిముందు గుమిగూడినారు. అతని తల వాలిపోయింది. 'నేను ఊరువిడిచి పోతున్నానా నాయుడూ? రేపిస్తానంటూ వున్నాను గదా?'

'ఊరువిడిచి పోతున్నావో, ఏట్లో గిలిసి పోతావో నాకెందుకు? జీత మొచ్చింది గదా? నా డబ్బు నాకియ్యి! నయాపైసా తగ్గినా ఒప్పుకోను. ఎవడబ్బ సొమ్ము?...'

ఒకనిమిషంసేపు ఎవరూ మాట్లాడలేదు. సుందరాచారి శవమైపోయినాడు. అతనికి ఈరకమైన భంగపాటు ఎప్పుడూ రాలేదు.

గుమ్మంలో జాలిగా నిలబడిన బాలామణిని చూచి సన్నగా నవ్వుతూ మీసం మీదికి చేతిని పోనిచ్చినాడు అబ్బాయి నాయుడు. 'అప్పుదీర్చలేనివాడికి అంత అందమైన పెండ్లాం దేనికి సుందరాచారీ? ... పోనీ, నీ పెండ్లాన్నే యిచ్చి అప్పుదీర్చుకోరాదూ?' పక్కనున్న పెద్దవాళ్లు సకిలించినారు. చుట్టూచేరిన మనుషులందరూ పండ్లికిలించినారు. సిగ్గుతో సగం చచ్చిన బాలామణి దభేలని తలుపువేసుకొనింది.

ఈ అవమానాన్ని సహించలేని సుందరాచారి కోపంతో విలువునా వొణికిపోతూ 'నాయుడూ! ఏమన్నావు నాయుడూ?' అంటూ అబ్బాయినాయుడిమీదికి దూకినాడు. అబ్బాయినాయుడిపైన ఈగైనా వాలుతుందా? ... పక్కనున్న పెద్దవాళ్లు సుందరాచారిని చితగ్గొట్టి, పందికొక్కును పారేసినట్టు పారేసినారు. అబ్బాయి నాయుడు అట్టహాసంతో ఊగిపోతూ ఆ చోటు విడిచి వెళ్లిపోయినాడు.

వీధిలో కూర్చున్న సుందరాచారి

---

ఒక సిల్కు చీర కొంటేనే ఒక క్యాలెండర్ ఉచితంగా ఇస్తానన్నాడు – ఆరు క్యాలెండర్లు పట్టుకొచ్చా!!



# బాలామణి

మెల్లగా తలపైకెత్తి చూచినాడు. ఎవరూ లేరు. దిక్కులన్నీ కనులు మూసుకొన్నాయా? సాక్ష్యం చెప్పవలసి వస్తుందని భయపడి సూర్యుడు దాగుకొన్నాడా?... సుందరాచారి దిక్కులేనివాడైనాడు.

ఎదురుగా, మూసిన తలుపు కనబడింది.

'బాలామణీ!' ... ఆ మాటతోబాటే ఏడుపు పొంగివచ్చింది. వెక్కివెక్కి ఏడ్చినాడు. ఎంతసేపు గడిచిందో తెలియదు. మనుషులోకంలోకరే అబ్బాయి నాయుడి బంటిదెనగా పడుగెత్తుతూ వున్నారు. బాలామణి తలుపు తీయనే లేదు. సుందరాచారి పైకిలేచినాడు తలుపు దగ్గరికివెళ్ళి 'బాలామణీ!' అని పిలిచినాడు పసిబిడ్డను ఓదార్చేవానివలె 'తలుపుతియ్యి బాలామణీ!' అన్నాడు, తలుపు సందులోనుంచి తొంగిచూచినాడు. వెమిలికోసంతా అదిరిపడేట్టుగా ఉయ్యాల్లో బిడ్డలు కూడా బెదిరిపోయేట్టుగా 'బాలామణీ!' అని ఒక్క అరుపు అరిచినాడు.

తలుపు ఈపాటునకల్లెపోయింది. ఇంక ఈ పాపపు నేలమీద నిలబడకూడదనుకొనిందో ఏమో — బాలామణి దూలానికి వేలాడుతూవుంది. ఆమెను ఉరితాటి కెక్కించిన హంతా తనపని తీరిపోయినట్టు ఒకమూల దొర్లిపడివుంది. ఇరుగుపొరుగు వాళ్ళు కొంతరు ఇంట్లోకి జొరబడినారు. బాలామణిని కిందికిదించి, నేలమీద పండబెట్టినారు. పలిగిన తెల్లకాగితం ఒకటి బిర్రుమనులె ఆమె మంగళసూత్రానికి చుట్టుకొనివుంది.

సుందరాచారి ఆమెపైన వాలిపోయినాడు. 'అయ్యో! ఎంత పనిచేసినావు బాలామణీ! నామీద నీకెందుకు కోప మొచ్చింది బాలామణీ?...ఇంత కష్టం నేను భరించలేను. నువ్వు బతికిపో బాలామణీ!' అంటూ పసిపిల్లవాడి మాదిరిగా ఏడ్చినాడు.

'నన్ను బదిలీచేయించుకొని వెళ్ళిపొమ్మని, నువ్వు వెమలికోనలోనే వుండిపోయినావా బాలామణీ! నాకు ఎంత అన్యాయం చేసినావు బాలామణీ!' అంటూ ఆమె చేతులను ముద్దుపెట్టుకున్నాడు. ఆమె చేతిగాజులు గలగలమన్నాయి. ఆమెతో కలిసి వెమిలికోనకు వచ్చినరోజు జ్ఞాపకం వొచ్చింది.

...పచ్చిపిందెలు గోసేసినారుమామా!... చెట్టున్నేవుండివుంటే అవి పెద్దవై దోరమాగేవి. చెట్టుకు అందమొచ్చేది!...

'నా బతుకు బోసిపోయిన చెట్టైపోయింది బాలామణీ!'

...జంగమదేవరె జగమునేత!
జంగమదేవరే సర్వేశ్వరుండు!'

'బాలామణీ!'

...కూతురా!...మననున్నకాపురం, మచ్చలేని బతుకు—ఇవే, ఆడది మగవాడికిచ్చే ఘనమైన కట్నాలు!...

'నా సౌభాగ్యాన్ని కాపాడుకోలేని వాణ్ణయినాను బాలామణీ! నువ్వే లేనప్పుడు నాకవన్నీ ఎక్కడుంటాయి బాలామణీ!'

గురప్పగసబ్బబోస్తూ అక్కడికివొచ్చినాడు.

...ఇదేమి ఘోరం! బాలామణి చచ్చిపోవలెనా?... మారేండ్లా బతికే వుండకూడదా?...

కావ్యంలోని కథానాయిక కాదు బాలామణి. ఏ కవీ ఆమెను చంపలేదు. ఒకవేళ ఆమె బ్రతుకొక కావ్యమే అయితే— కవి కాలానికే ఎదురు తిరిగే స్థిర సంకల్పం ఆమెది. బాలామణి వాస్తవిక స్త్రీ! మానాభిమానాలున్న ఆడబడుచు!

'అదేది సార్?' అన్నాడు గురప్ప, బాలామణి మంగళసూత్రానికి చుట్టుకొనివున్న కాగితాన్ని చూపించి. సుందరాచారి దాన్ని విప్పి, గురప్ప చేతికిచ్చినాడు. కన్నుల్లో నీళ్ళు కమ్ముకుంటూ వుండగా— కాగితంలో వున్న బాలామణి మాటల్ని ఇటుల చదివినాడు గురప్ప.

'హింసలన్నీ సహించినాను. అవమానాలన్నీ భరించినాను. అయితే ఈ ఒక్క మాటకు నేను తట్టుకోలేకపోయినాను మామా! నాముఖంచూచి, సలుగురిలో 'నీ పెండ్లాన్నిస్తావా' అని నన్నే అడిగినాడే!...ఆడదానికింతకంటే అవమానం వుంటుందా? నిన్ను విడిచి నేను పోవాలనుకోలేదు మామా! ఆ మాటను మరిచిపోవాలనుకున్నాను. వేలాయుధస్వామీ! వాడు నన్నంటే అన్నాడు — అంతమాట ఇంక ఏ ఆడదాన్ని అననీయకు స్వామీ!... ఏడువవద్దు మామా, ఏడువవద్దు! నా ఏడుపే చాలు! నా కన్నీళ్ళే చాలు!... మన మానంతో చెలగాటమాడిన వాణ్ణి నువ్వైనా మన్నించు! ఏడువవద్దు మామా, ఏడువవద్దు!...

'ఏడువకుండావుండగలనా, బాలామణీ!' సుందరాచారి ఏడుపు తారస్థాయిని అందుకొనింది.

గురప్ప అన్నాడు... 'సార్! అబ్బాయి నాయుడికి నోరు పడిపోయింది!...'

సుందరాచారి ఏడుపు ఆగిపోయింది.

'ఏడువను బాలామణీ, ఏడువను!'

...అతన్ని ఓదార్చేందుకా అన్నట్టున్న చిమ్మచీకటిలో—బాలామణికోసరం కట్టిన గోరీ మాదిరిగా విశ్శబ్దంగా వుంది వెమలికోన! ●

